
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సిద్దిపేట
5
బుధవారం 25 సెప్టెంబరు 2024





లడ్డూ కౌంటర్ వద్ద క్యూలో నిల్చున్న భక్తులు

మల్లన్న లడ్డూ పదిలమేనా?!

చేర్యాల, సెప్టెంబరు 24: తిరుపతి లడ్డూ తయారీలో కల్తీ వివాదం చర్చనీయాంశమైన నేపథ్యంలో జిల్లాలోని కొమురవెల్లి మల్లన్న ఆలయ లడ్డూ ప్రసాద నాణ్యతపై ప్రతిఒక్కరూ దృష్టిసారించారు. అయితే, కొందరిలో 'మల్లన్న' లడ్డూ పదిలమేనా? అన్న సందేశాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో ఆలయాధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. ఆలయంలో 100 గ్రాముల లడ్డూను రూ.25చొప్పున విక్రయిస్తున్నారు. ఈ లడ్డూలు విరివిగా దొరుకుతాయి. ఇక కల్యాణం, అభిషేకం టికెట్‌పై 400 గ్రాముల లడ్డూను భక్తులకు అందజేస్తారు. ప్రత్యేకంగా కావాలంటే 400 గ్రాముల లడ్డూ రూ.100కు విక్రయిస్తున్నారు. ఈ లడ్డూలు మాత్రం ఆదివారం, జాతర సమయాలు మినహా మామూలు రోజుల్లో తక్కువగా తయారు చేస్తారు. ఆలయానికి చాలా సంవత్సరాలుగా కరీంనగర్ డెయిరీ నుంచి సాధారణ రోజుల్లో నెలకు వెయ్యి కిలోలు, జాతర సాగే మూడు నెలల కాలంలో నెలకు 3వేల కిలోలకు పైగా నెయ్యిని వినియోగిస్తున్నారు. కరీంనగర్ డెయిరీ వారు కిలో రూ.621చొప్పున సరఫరా చేస్తున్నారు. తిరుపతి ఘటన నేపథ్యంలో విజయ డెయిరీ నుంచి నెయ్యి కొనుగోలుకు ఇండెంట్ పెట్టారు. ప్రస్తుతం ఉన్న కరీంనగర్ స్టాక్ పూర్తి కాగానే విజయ డెయిరీ నుంచి నెయ్యి సరఫరా కానుంది. ఇప్పటి వరకు నెయ్యి నాణ్యతా ప్రమాణాలపై తనిఖీలు చేయలేదు. తిరుపతి ఘటన నేపథ్యంలో ఇక నుంచి తనిఖీ చేస్తామని ఆలయాధికారులు చెబుతున్నారు.



కమ్ముకున్న కారుమబ్బులు

సిద్దిపేట జిల్లాలో మంగళవారం సాయంత్రం కారుమబ్బులు కమ్ముకున్నాయి. సాయంత్రం ఐదు దాటక ముందే చీకటి ముసురుకుంది. కాసేపటికి అక్కడక్కడ మోస్తరు వర్షం కురిసింది. కొన్నిరోజులుగా వేడి, ఉక్కపోతతో అల్లాడిన జనం చిరుజల్లులు కురవడంతో కాస్త సేదతీరారు. ప్రజలు తమ సెల్‌ఫోన్లతో ఫొటోలు తీసుకున్నారు.


సిద్దిపేట ఫొటోగ్రాఫర్



ప్రిపేర్డ్‌గా ఉండండి.. సారొస్తున్నారు

- ఫుడ్ కమిషన్ చైర్మన్ పర్యటనపై అప్రమత్తం
- ముందస్తుగా డీఈవో పేరుతో అలర్ట్ మెసేజ్‌లు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాలు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 24: తప్పు జరిగితే చర్యలు తీసుకోవాల్సిన వారే.. పద్ధతి ప్రకారం వ్యవస్థ నడిచేలా చూడాల్సిన పెద్దసార్లే.. పర్లేదులే అంతా మనోళ్లే కదా అన్నట్లు వ్యవహరిస్తున్నారు.. పైగా అధికారులు, సిబ్బంది తప్పుచేసి పట్టుబడతారేమోనని ముందస్తుగా అప్రమత్తం చేస్తున్నారు. తాజాగా స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్ సిద్దిపేట జిల్లాలో పర్యటించనున్నారు. మోడల్ స్కూల్స్, కేజీబీవీలు, ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు తనిఖీ చేసి ఫుడ్ క్వాలిటీ, క్యాంటీన్, పరిసరాల పరిశుభ్రత, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బిల్లులు చెక్ చేయనున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. అయితే ఈ పర్యటన వివరాలు ముందుగానే లీక్ అయ్యాయి. ఈ ముందస్తు సమాచారం చేరవేసేది ఎవరో చిన్న చిన్న అధికారులు అనుకుంటే పొరపాటే. "సారు వస్తుండు జాగ్రత్త అంతా ప్రిపేర్డ్‌గా ఉండండి..." అని జిల్లా విద్యాధికారి పేరుతోనే ఓ మెసేజ్ సెల్‌ఫోన్లలో ఫార్వర్డ్ అవుతుంది. మధ్యాహ్న భోజనం శుచిగా, శుభ్రంగా ఉండాలని వంటవాళ్లు అప్రాన్, గ్లౌజులు, హెడ్గేర్ ధరించి ఉండాలని, ఎవరు ఏ ప్రశ్న వేసినా సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉండాలని అందులోని సారాంశం. అయితే ముందస్తు మెసేజ్ రావడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. విద్యార్థి సంఘాల నాయకులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తనిఖీల సమయాల్లోనే అంతా బాగుండి.. మిగిలిన రోజుల్లో ఎలా ఉన్నా పర్లేదా అంటూ వారు ప్రశ్నిస్తున్నారు.


Forwarded many times
◆ ముఖ్య గమనిక ◆
జిల్లాలోని సమస్త మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మోడల్ స్కూల్స్ ప్రిన్సిపల్స్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్స్, కేర్ టేకర్ గర్ల్స్ హాస్టల్ అందరికీ ప్రత్యేకమైనటువంటి సూచన.
ఈనెల 25న, అనగా బుధవారం నాడు తెలంగాణ ఫుడ్ కమిషన్ చైర్మన్, జిల్లాలో పర్యటించనున్నారు. కావున సమస్త పాఠశాలలలో ఆరోజు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం రుచిగా శుచిగా వడ్డించేట్లుగా జాగ్రత్త తీసుకోగలరు. అంతే కాకుండా కిచెన్ షెడ్ చుట్టుపక్కల, పరిశుభ్రమైనటువంటి వాతావరణం కల్పించి, అందుబాటులో ఉన్నచోట apron, గ్లోవ్స్ మరియు హెడ్గేర్ ధరించి, వచ్చినటువంటి విజిటర్స్ ఏ రకమైన ప్రశ్నలు వేసినను సమాధానం చెప్పేటట్లుగా, పాఠశాలల్లోని సిబ్బంది మరియు మధ్యాహ్న భోజన సిబ్బంది అందరూ రెడీగా ఉండాలి. అంతేకాకుండా మధ్యాహ్న భోజనానికి సంబంధించినటువంటి రికార్డులు, బిల్స్ వివరాలు కూడా అందుబాటులో పెట్టుకోగలరు.
జిల్లాలోని ఏ పాఠశాలనైనను, సందర్శించే అవకాశం ఉన్నందున అన్ని పాఠశాలల సిబ్బంది ప్రిపేర్ గా ఉండాలి.
-- జిల్లా విద్యాధికారి, సిద్దిపేట
2:40 pm

రెండురోజుల్లో నిశ్చితార్థం.. అంతలోనే మృత్యుఒడికి

- విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి
- న్యాయం చేయాలని కుటుంబీకుల ఆందోళన

అక్కన్నపేట, సెప్టెంబరు 24: రెండు రోజుల్లో అతని నిశ్చితార్థం.. అందుకు సంబంధించిన పనుల్లో కుటుంబీకులు నిమగ్నమయ్యారు. ఇంతలోనే ఆ ఇంట విషాదఛాయలు అలుముకున్నాయి. త్వరలో పెళ్లిపీటలు ఎక్కాల్సిన కొడుకు విద్యుదాఘాతంతో చనిపోవడంతో తల్లిదండ్రుల, కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. అక్కన్నపేట మండలం గౌరవెల్లి ప్రాజెక్టు ముంపు గ్రామమైన గుడాటిపల్లిలో గ్రామపంచాయతీ పరిధిలోని జాలుబాయితండాలో మంగళవారం ఈ సంఘటన చోటుచేసుకున్నది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం..

దూళిమిట్ట మండలం కొండాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మల్లన్నగుట్టతండాకు చెందిన గుగులోతు వెంకటరాము, కౌసల్య దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు తిరుపతి (25) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. విద్యుత్ అధికారులు తిరుపతిని రోజువారీ పనుల కోసం తీసుకెళ్తూ డబ్బు ఇస్తుంటారు. మంగళవారం కూడా జాలుబాయితండాలో ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్య ఉందని గౌరవెల్లి ట్రాన్స్‌కో ఏఎల్ఎం రాజేందర్ ఫోన్ చేశారు. తనకు రెండురోజుల్లో నిశ్చితార్థం ఉందని చెప్పినా కూడా అధికారులు రావాల్సిందిగా ఒత్తిడి చేయడంతో వెళ్లాడని రిపేర్ చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై చనిపోయాడని మృతుని సోదరుడు తెలిపాడు. అయితే, తిరుపతి మృతికి ట్రాన్స్‌కో ఏఎల్ఎం రాజేందర్ కారణమని కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న ఎస్ఐ విజయ్‌భాస్కర్ సంఘటనా స్థలానికి చేరుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మృతదేహాన్ని హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



తిరుపతి(ఫైల్)



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు రమేష్. ఈయనకు పక్షవాతం వచ్చి కాళ్లు, చేతులు పనిచేయవు. 2023 జూన్‌లో సదరం శిబిరానికి వెళ్తే డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్ మంజూరు చేశారు. తనకు నెలనెలా పెన్షన్ వస్తే ఎంతో కొంత ఆసరా అవుతుందని భావించాడు. కానీ ఇప్పటి వరకు పెన్షన్ మంజూరు కాలేదు. నాటి నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. గతంలో ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేశాడు. అయినా ఫలితం శూన్యం.. ఇటీవల నిర్వహించిన ప్రజావాణిలో కూడా డీఆర్డీఏ పీడీ జగదేవ్‌ఆర్యను కలిసి తన కుటుంబ పరిస్థితులను విన్నవించాడు. పెన్షన్ మంజూరు చేయాలని వేడుకున్నాడు.



సిద్దిపేటకు చెందిన మల్లయ్యకు యాక్సిడెంట్‌లో కాలుపోయింది. నాటి నుంచి స్టాండ్ సహాయంతోనే నడుస్తున్నాడు. సదరం క్యాంపునకు వెళ్లగా డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్‌ను మంజూరు చేశారు. పింఛన్ కోసం అధికారుల చుట్టూ తిరిగినా ఇప్పటికీ మంజూరు కాలేదు. పెన్షన్ మంజూరు చేసి ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

ఇలా వీరిద్దరే కాదు జిల్లాలో దాదాపు 3వేల మందికి పైగానే దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ ఉన్నా కూడా పెన్షన్‌కు నోచుకోక నానా అవస్థలు పడుతున్నారు. ఎంతో దూరం నుంచి వ్యయప్రయాసలు ఓర్చి ప్రజావాణిలో వినతులు ఇస్తున్నా కూడా ప్రయోజనం లేదని, స్థానిక అధికారులకు విన్నవించినా వారి సమస్యను మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు.

పెన్షన్ వస్తలేదు..!

- సదరం సర్టిఫికెట్ ఉన్నా.. తప్పని నిరీక్షణ
- జిల్లాలో 3 వేల మందికి పైగానే ఎదురుచూపులు
- రెండేళ్ల క్రితం మంజూరు చేసిన పెన్షన్లు నేటికీ అందని వైనం
- దివ్యాంగులకు తప్పని తిప్పలు

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 24: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులను ఆదుకునేందుకు నెల నెలా ఆసరా పెన్షన్ ద్వారా రూ.4 వేలు అందిస్తుంది. కొందరు పెన్షన్ పొందేందుకు అన్ని అర్హతలున్నప్పటికీ రెండేళ్ల నుంచి మంజూరు చేయడం లేదు.

పెన్షన్ కోసం దివ్యాంగులు దరఖాస్తు చేసుకున్న తర్వాత వారికి కేటాయించిన రోజు సదరం శిబిరానికి హాజరుకావాల్సి ఉంటుంది. అక్కడ వైద్యులు పరీక్షించి అంగవైకల్యం 40 శాతానికి పైగా ఉన్న వారిని ఆసరా పెన్షన్‌కు అర్హులుగా గుర్తిస్తారు. దివ్యాంగులు సదరం సర్టిఫికెట్‌తో పాటు, ఆధార్, బ్యాంక్ అకౌంట్‌తో ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకుంటారు. అక్కడ ఆన్ లైన్‌లో నమోదు చేసి డీఆర్డీఏ కార్యాలయానికి పంపిస్తారు. ఆ కార్యాలయంలో పరిశీలించి పెన్షన్ మంజూరు చేస్తారు. అయితే ప్రక్రియ రెండేళ్ల నుంచి నిలిచిపోయింది. జిల్లాలో దాదాపు 14,004 మంది దివ్యాంగులకు రూ.4వేలు చొప్పున ఆసరా పెన్షన్ వస్తుంది. డీఆర్డీఏ ఆధ్వర్యంలో ప్రతి గురువారం సిద్దిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సదరం క్యాంపులు నిర్వహించి వారికి సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్నా పెన్షన్ మాత్రం మంజూరు కావడం లేదు. దాదాపు 3వేల మందికి పైగా దివ్యాంగులు పెన్షన్‌కోసం ఎదురుచూస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పెన్షన్ మంజూరు చేయాలని దివ్యాంగులు కోరుతున్నారు.





ప్రభుత్వం నుంచి అనుమతులు రావాలి

నూతన పెన్షన్లకు మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉంది. అనుమతి రాగానే అర్హులందరికీ పెన్షన్ మంజూరు చేస్తాం.

- జగదేవ్‌ఆర్య, డీఆర్డీఏ పీడీ

హుస్నాబాద్ పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలి

- 80 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు
- పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామివేత్తలు ముందుకు రావాలి
- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి ప్రభాకర్

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 24 : హుస్నాబాద్ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అక్కన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న టీజీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కులో పరిశ్రమల స్థాపనకు ఉత్సాహవంతులైన పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం కలెక్టర్ మనుచౌదరి, టీజీఐఐసీ అధికారులు, పారిశ్రామికవేత్తలు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించి మాట్లాడారు. వెనుకబడిన హుస్నాబాద్ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందితే ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అందులో భాగంగానే అక్కన్నపేట మండల కేంద్రంలో టీజీఐఐసీ ద్వారా 80 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేయబోతున్నామన్నారు. వచ్చే వానాకాలం నాటికి గౌరవెల్లి ప్రాజెక్టు నీటితో హుస్నాబాద్‌లో అధిక పంటలు పండుతాయని చెప్పారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి చాలా అనుకూలంగా మారుతుందని మంత్రి పేర్కొన్నారు. త్వరలోనే రూ.170 కోట్లతో హుస్నాబాద్ కరీంనగర్ ఫోర్ లేన్ రోడ్డు నిర్మాణం చేపడతామని, హుస్నాబాద్, జనగామ మధ్య ఫోర్ లేన్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేస్తున్నామని తద్వారా రవాణా సౌకర్యం ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఎలాంటి సమస్యలూ లేని భూమిలో పార్కును ఏర్పాటు చేస్తున్నందున యజమానులకు ఎలాంటి ఇబ్బందులూ ఉండబోవని చెప్పారు.

వర్గల్ టీజీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కులో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన తెలిపారు. అనంతరం కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చేవారికి జిల్లా అధికార యంత్రాంగం తరఫున పూర్తి సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట, హుస్నాబాద్ ఆర్డీవోలు సదానందం, రామ్మూర్తి వివిధ శాఖల ఉన్నత అధికారులు, తదితరులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

క్రీడల్లోనూ రాణించాలి

హుస్నాబాద్, సెప్టెంబరు 24 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర, జాతీయస్థాయిలో క్రీడల్లో రాణించే నియోజకవర్గ విద్యార్థులకు మంచి పారితోషికం అందిస్తామన్నారు. మంగళవారం ఆయన హుస్నాబాద్‌లోని మినీ స్టేడియాన్ని సందర్శించారు. క్రీడల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై క్రీడాకారులతో చర్చించారు. అనంతరం స్టేడియంలో కబడ్డీ కోర్టును ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి బ్యాడ్మింటన్ ఆడారు. పట్టణంలోని మోడల్ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. 10వ తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే హుస్నాబాద్ మొదటి స్థానంలో ఉండాలని సూచించారు. వర్షాలు వచ్చినప్పుడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణ ముంపునకు గురవుతుండటంతో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. గిరిజన బాలికల కళాశాల హాస్టల్ కాంపౌండ్‌వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఆర్డీవో రామ్మూర్తి, కమిషనర్ మల్లికార్జున్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వద్ద వ్యర్థాలను తొలగిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

స్వచ్ఛతా హీ సేవ..

స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆయన పట్టణంలోని ఎల్లమ్మ చెరువు వద్ద గణేశ్ నిమజ్జనం తరువాత ఉన్న వ్యర్థాలను ప్రజాప్రతినిధులు, అధికారులు, పారిశుధ్య కార్మికులతో కలిసి తొలగించారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞ చేసి మాట్లాడారు. గణేశ్ నిమజ్జనంతో కార్యక్రమం ముగిసినట్లు కాదని, నిమజ్జనం తరువాత ఏ చెరువు లో అయితే గణేషులను వేశామో అందులోని వ్యర్థాలను తొలగించిన తరువాతే ఈఉత్సవాలకు పరిపూర్ణత వస్తుందన్నారు.

20 మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోలు

కొండపాక, సెప్టెంబరు 24: జిల్లాలోని 20 మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోలను నియమిస్తూ విద్యాశాఖ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని 26 మండలాలకు కేవలం ఆరుగురు ఎంఈవోలు మాత్రమే ఉన్నారు. ఒక్కొక్కరు ఆరు నుంచి ఎనిమిది మండలాలకు ఇన్‌చార్జులకు కొనసాగుతున్నారు. ఫలితంగా పాఠశాలల పర్యవేక్షణ లోపిస్తుందని భావించిన ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న మండల నోడల్ అధికారులకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు నంగునూరు, దుబ్బాక, కొండపాక, ములుగు, చిన్నకోడూరు, వర్గల్ మండలాలకు ఎంఈవోలు ఉన్నారు. వీరు ఆ హోదాలో కొనసాగనున్నారు. కోహెడ, తొగుట, దౌల్తాబాద్, గజ్వేల్, మిరుదొడ్డి, చేర్యాల, బెజ్జంకి, భూంపల్లి అక్బర్‌పేట, అక్కన్నపేట, దూళ్మిట్ట, హుస్నాబాద్, నారాయణరావుపేట, జగదేవ్‌పూర్, రాయపోల్, కొమురవెల్లి, కుకునూరుపల్లి, సిద్దిపేట రూరల్, సిద్దిపేట అర్బన్, మదూరు, మర్కుక్ మండలాలకు ఆయా మండలాల్లో పనిచేస్తున్న ఎంఎన్‌వోలను ఎంఈవోలుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ప్రతీ కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ చేయాలి : సీపీ

నంగునూరు/చిన్నకోడూరు/సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 24 : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతీ కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ చేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ స్పష్టం చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం నంగునూరు మండలం రాజగోపాలపేట పోలీస్ స్టేషన్‌ను, చిన్నకోడూరు పోలీస్‌స్టేషన్‌ను ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది నిజాయితీగా విధులు నిర్వహించాలని, విధి నిర్వహణలో అలసత్వం పనికిరాదని చెప్పారు. సమాచార వ్యవస్థను ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకోవాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై నిఘా పటిష్ఠం చేయాలని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఒక్క ఫిర్యాదుదారునితో ఎస్ఐ నేరుగా మాట్లాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బెల్టుషాపులపై నిఘా ఉంచాలన్నారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులదేనన్నారు. చిన్నకోడూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కను నాటి నీరు పోశారు. పోలీస్ స్టేషన్ పచ్చదనం-పరిశుభ్రతతో బాగుందని ఎస్ఐ బాలకృష్ణను, సిబ్బందిని అభినందించారు. ఆమె వెంట సిద్దిపేట ఏసీపీ మధు, రూరల్ శీను, ఎస్‌బీఐ ఇన్‌స్పెక్టర్ కిరణ్, శ్రీధర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



చిన్నకోడూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటిన సీపీ అనురాధ

ఈ నెల 28న జాతీయ లోక్‌అదాలత్

ఈనెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీపడేలా కక్షిదారులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని సీపీ అనురాధ కోర్టు విధులు నిర్వహించే వారికి సూచించారు. మంగళవారం కమిషనర్ కార్యాలయంలో కోర్టు విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఆమె జాతీయ మెగా లోక్ అదాలత్‌పై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ప్రతీ ఒక్క సీడీవో ఛాలెంజ్ తీసుకుని విధులు నిర్వర్తించాలని సూచించారు. ఫిర్యాదుదారులను, ముద్దాయిలకు కౌన్సెలింగ్ నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ యస్. మల్లారెడ్డి, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, కోర్టు లైజనింగ్ హెడ్ కానిస్టేబుల్ లోకేశ్వర్, కోర్టు విధులు నిర్వహించే సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తా..

● సీఎం దృష్టికి డీలర్ల న్యాయమైన డిమాండ్లు

● రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, సెప్టెంబరు 24: సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రేషన్ డీలర్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన రాష్ట్ర డీలర్ల సంఘం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పౌర సరఫరాల్లో భాగంగా నిత్యావసర వస్తువుల పంపిణీలో కీలక పాత్ర పోషిస్తూ ప్రజల ఆహార భద్రతకు వారధిగా పనిచేస్తున్న డీలర్లకు అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ఆరు దశాబ్దాల ఘనమైన చరిత్ర ఉన్న రేషన్ డీలర్ల సంఘానికి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా తనను ఎన్నుకోవడంపై కృతజ్ఞత తెలిపారు. తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సమస్యలను, హక్కులను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. ముఖ్యంగా ఐదువేల గౌరవ వేతనం, క్వింటాలుకు రూ.300ల కమీషన్ ఇవ్వాలన్న డిమాండ్‌ను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. డీలర్ల డిమాండ్లను పరిష్కరించిన మరుక్షణం రూ.2 లక్షలతో హైదరాబాద్‌లో సీఎంకు కృతజ్ఞత సభను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు మాట్లాడుతూ ప్రధాన సమస్యలతో పాటు రూ.10 లక్షల ఇన్సూరెన్స్, ఎంఎల్ఎస్ పాయింట్లలో ఎలక్ట్రానిక్ తూకం వే బ్రిడ్జీలు, మృతిచెందిన డీలర్ల కుటుంబాలకు రేషన్ దుకాణాలను కేటాయించడం తదితర డిమాండ్లను పరిష్కరిస్తే ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. ఈ సమావేశంలో జాతీయ అధ్యక్షుడు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి విశ్వంబర్, వివిధ జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చిన డీలర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

టపాసులు కాలుస్తుండగా బాల కార్మికుడికి గాయాలు


బాలుడి చేతికి అయిన గాయం

శివ్వంపేట, సెప్టెంబరు 24: పంటను కోతులు, పిట్టల బెరద నుంచి రక్షించేందుకు టపాసులు కాలుస్తుండగా బాల కార్మికుడి చేతికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గంగయ్యపల్లిలో ఆలస్యంగా వెలుగుచూసింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగయ్యపల్లిలోని ఆర్ఎస్‌డీఏ విత్తన పరిశ్రమలో యశ్వంత్(16) పనిచేస్తున్నాడు. అయితే పరిశ్రమ యాజమాన్యం కోతుల, పిట్టల బెడద నుంచి పంటను రక్షించేందుకు సుతిలి బాంబు టపాసులు కాల్చమని యశ్వంత్‌ను ఆదేశించారు. అతడు బాంబులు కాలుస్తుండగా చేయికి నిప్పు తగిలి గాయాలయ్యాయి. దీంతో పరిశ్రమ యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా యశ్వంత్‌ను ఆస్పత్రిలో చికిత్స చేయించి ఇంటికి పంపించారు. బాల కార్మికుడితో పని చేయించడమే కాకుండా.. టపాసులు కాల్పించిన పరిశ్రమ యజమానిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మెదక్ స్టేడియానికి ఇందిరాగాంధీ పేరెలా కొనసాగిస్తారు..?: బీజేపీ


అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 24: మెదక్ స్టేడియానికి ఎలాంటి ఆధారాలు లేకుండా ఇందిరాగాంధీ పేరెలా కొనసాగిస్తారని, వెంటనే శిలాఫలకంపై పేరు తొలగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీవైఎస్‌వో దామోదర్‌రెడ్డిని కలిసి ఆయన వినతిపత్రాలు అందజేసి మాట్లాడారు. మెదక్ నుంచి ఇందిరాగాంధీ గెలిచి ప్రధాని అయితే ఈ ప్రాంతానికి చేసింది ఏమీలేదన్నారు. అప్పటి మంత్రి కరణం రాంచంద్రరావు విజ్ఞప్తి మేరకు ఎన్టీఆర్ హయాంలో స్టేడియాన్ని మంజూరు చేయించారన్నారు. 2000 సంవత్సరంలో సీఎం నారా చంద్రబాబు హయాంలో స్టేడియాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. అప్పటి నుంచి మెదక్ స్టేడియంగానే కొనసాగుతోందన్నారు. 2018లో ప్రధాని మోదీ సర్కార్ సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి రూ.5.50 కోట్లను ఖేలో ఇండియా ద్వారా మంజూరు చేసిందన్నారు. అప్పటి రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు లోపల కాంగ్రెస్.. బయట బీఆర్ఎస్‌లా వ్యవహరించి అధికారులను తప్పుతోవ పట్టించారని ఆరోపించారు. వెంటనే శిలాఫలకంపై ఇందిరాగాంధీ పేరు తొలగించి మెదక్ స్టేడియంగా కొనసాగించాలని, లేదా క్రీడలకు స్ఫూర్తి అయిన మేజర్ ధ్యాన్ చంద్, రామచంద్రరావు పేరు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం పరిణిత సోమశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు.

హెల్మెట్ పెట్టుకుని ఉంటే..

- చేర్యాలలో వరుస ప్రమాదాలు
- మృత్యువాత పడుతున్న వాహనదారులు
- అన్నీ హెల్మెట్ లేకపోవడం వల్లే..

చేర్యాల, సెప్టెంబరు 24 : అబ్బా.. రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయం తగలడంతోనే చనిపోయాడు.. హెల్మెట్ ధరించి ఉంటే కచ్చితంగా ప్రాణాలు దక్కేవి.. అంటూ ఘటనా స్థలాల్లో తరుచూగా ఇలాంటి మాటలు వింటుంటాం. అయితే హెల్మెట్ ధరించండి మహాప్రభో అంటూ ఇటు పోలీసులు, అటు కుటుంబ సభ్యులు చెబుతున్నా చాలామంది పెడచెవిన పెడుతున్నారు. ఈ నిర్లక్ష్యమే బైకు ప్రమాదాల రూపంలో పలువురి ప్రాణాలను హరిస్తున్నది. ఇటీవల చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో జరిగిన వరుస ఘటనలే ఇందుకు నిలువెత్తు నిదర్శనం.

ఇటీవల జరిగిన ఘటనలివే..

● ఆదివారం రాత్రి చేర్యాల మండలం చుంచనకోట శివారులో బైకు చెట్టుకు ఢీకొన్న సంఘటనలో కొమురవెల్లి గ్రామానికి చెందిన కిష్టంపేట గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ మురళి తలకు గాయమై మృతి చెందాడు.

●కడవేరుగు శివారులో బైకుపైనుంచి కిందపడటంతో తలకు బలమైన గాయం తగిలి ఆ గ్రామానికి చెందిన డ్రైవర్ కొమ్మినేని కిషన్ దుర్మరణం చెందాడు. గుర్జకుంట శివారులో రోడ్డుపై రాంగ్‌పార్కింగ్ చేసి ఉన్న లారీని బైకుతో ఢీకొట్టి ప్రైవేటు టీచర్ దాసరి ప్రభాకర్ మృతిచెందాడు.

●పోసాన్‌పల్లి గ్రామశివారులో బైకుపై త్రిబుల్ రైడింగ్‌తో అతివేగంగా ప్రయాణిస్తూ బోనకొల్లూరు కార్తీక్ చనిపోయాడు. నర్సాయపల్లి గ్రామశివారులో ఓ ఉపాధ్యాయుడు, గత నెలలో కర్నూలు జిల్లా డోన్ మండలం మల్కాపురం గ్రామానికి చెందిన వలస కార్మికుడు బోయ హరి బైకు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఇవన్నీ కేవలం హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగిన మరణాలే.



తలకు గాయమై నర్సాయపల్లి దారిలో మృతి చెందిన వలస కార్మికుడు

అవగాహన కల్పిస్తున్నా పట్టింపేదీ..?

హెల్మెట్ శ్రీరామ రక్ష. రోడ్డుప్రమాద సమయంలో తలకు తగిలే గాయాల తీవ్రతను తగ్గిస్తూ ప్రాణాలు కోల్పోకుండా ప్రభావవంతంగా పనిచేస్తుంది. గాలి, వర్షం, ఎండ నుంచి తలకు పూర్తిరక్షణ కల్పిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ప్రతి ద్విచక్రవాహనదారుడు విధిగా విధిగా హెల్మెట్ ధరించాలి అని పోలీసులు, రవాణాశాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా వాహనదారులు పట్టించుకోవడం లేదు. అంతేకాకుండా రోడ్డుభద్రతా వారోత్సవాల పేరిట ప్రతిజ్ఞ చేయిస్తున్నా, ప్రదర్శనలు నిర్వహిస్తున్నా, జరిమానాలు విధిస్తున్నా చెవిటోడి ముందు శంఖం ఊదిన చందంగా వ్యహరిస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుని తమ కుటుంబాల్లో చీకట్లు నింపుతున్నారు.

పండ్లిచ్చి చెబుతున్నాం.. ప్రాణాలు కాపాడుకోండి..

● హెల్మెట్ వినియోగంపై పోలీసుల వినూత్న అవగాహన

వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి.. ప్రాణాలు కాపాడుకోవాలని పోలీసులు మంగళవారం అవగాహన కల్పించారు. చేర్యాల సీఐ ఎల్. శ్రీను ఆధ్వర్యంలో సిబ్బంది వాహనదారులకు పండ్లు చేతికిస్తూ హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇటీవల చేర్యాల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో అధికంగా హెల్మెట్ ధరించనివారే మృత్యువాతపడ్డారన్నారు. హెల్మెట్ ధరిస్తే ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడవచ్చు అన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని సూచించారు.





తలకు హెల్మెట్ లేకపోవడంతో కడవేరుగు దారిలో మరణించిన కిషన్

ప్రజల్లో మార్పు తీసుకువస్తాం ..

రోడ్ సేఫ్టీలో భాగంగా బైకుపై ప్రయాణం చేసే ప్రతీ ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ సూచనలు చేస్తున్నాం. తప్పనిసరి పరిస్థితులలో జరిమానాలు కూడా విధిస్తున్నాం. అయినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో పలువురు నిండు ప్రాణాలు కోల్పోతున్నారు. మరింత పకడ్బందీ చర్యలు తీసుకుని ప్రజల్లో మార్పు తీసుకువస్తాం.

\- శ్రీను, సీఐ చేర్యాల

ఆలయాల నిర్వహణ బాధ్యతలను సాధుసంతులకు అప్పగించాలి

● హిందూ ఆలయాల పరిరక్షణ సమితి డిమాండ్

కల్హేర్, సెప్టెంబరు 24 : ఆలయాల నిర్వహణ బాధ్యతలను దేవాదాయ శాఖ నుంచి తప్పించి సాధుసంతులు, సనాతన ధర్మ పరిరక్షకులకు అప్పగించాలని హిందూ ఆలయాల పరిరక్షణ సమితి నారాయణఖేడ్ నియోజకవర్గ బాధ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కల్హేర్‌లో స్థానిక తహసీల్దార్ శివ శ్రీనివాస్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సమితి బాధ్యులు సాయిరాం, అనిల్‌రెడ్డి, కరణం సంగమేశ్వర్‌రావు మాట్లాడుచూ హిందూ ఆలయాల్లో ఉద్యోగాలు నిర్వహిస్తున్న అన్య మతస్థులను తొలగించాలన్నారు. దేవాలయాల భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సమితి బాధ్యులు రాజుగౌడ్, అల్లాపురం రాజు, రమేష్, కిష్టయ్య, పండరి, విటల్, బాగయ్య పరుశురాం, సంతోష్, అరవింద్, నర్సింహులు, భిక్షపతి, రామక్రిష్ణ, నరేందర్, రాజేశ్వర్, సాయిరాం, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ. 11.83 లక్షలు

వర్గల్, సెప్టెంబరు 24 : జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నాచగిరి లక్ష్మీనృసింహ స్వామి క్షేత్రం హుండీని సోమవారం లెక్కించారు. దేవాదాయ శాఖ ఉమ్మడి మెదక్ జిల్లా సహాయ కమిషనర్ చంద్రశేఖర్ పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించారు. 75 రోజులకుగాను రూ.11,83,932 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి అన్నపూర్ణ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుధాకర్, పాండు, నరేందర్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై సీపీఐ ఆందోళన

జహీరాబాద్, సెప్టెంబరు 24 : జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్‌లోని కార్మిక శాఖ కార్యాలయానికి అధికారులు గైర్హాజరవడం సరికాదని సీపీఐ డివిజన్ కార్యదర్శి నర్సింహులు అన్నారు. మంగళవారం ఆ పార్టీ నాయకులు కార్మికశాఖ అధికారులకు సమస్యలపై విన్నవిద్దామని వెళ్లితే కార్యాలయానికి తాళం ఉండడంతో వారు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ 20 రోజులుగా కార్యాలయంలో అధికారులు లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డెత్ క్లెయిమ్‌లు, మ్యారెజీ, డెలివరిగిఫ్టులు, లేబర్‌కార్డులు తదితర అవసరాల నిమిత్తం వస్తున్న కార్మికులు వెనుదిరిగి పోతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

తూప్రాన్, సెప్టెంబరు 24: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన తూప్రాన్ పట్టణ పరిధి ఆబోతుపల్లిలో చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఆబోతు ప్రవీణ్ (31) భార్య వరలక్ష్మి మధ్య ఈ నెల 18న సంసారం విషయంలో గొడవ జరిగింది. దీంతో భార్య పిల్లలను తీసుకురావడానికి పాఠశాలకు వెళ్లగా.. భర్త ప్రవీణ్ ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగాడు. గుర్తించిన కుటుంబీకులు చికిత్స కోసం కొంపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అమ్మవారి ఆలయంలో మళ్లీ చోరీ

కుకునూరుపల్లి, సెప్టెంబరు 24: రాయవరం దుర్గమ్మ గుడిలో మరోసారి దొంగలు వారి చేతివాటం ప్రదర్శించారు. గ్రామానికి అర కిలోమీటరు దూరంలో ఉన్న ఈ ఆలయంలో ఇప్పటికే రెండుసార్లు దొంగతనం జరుగగా.. సోమవారం రాత్రి కూడా దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ఆలయ నిర్వాహకులు మంగళవారం ఆలయానికి వెళ్లగా తలుపులు తీసి ఉండడం, వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో గ్రామస్థులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని పరిశీలించగా అమ్మవారి పుస్తెమట్టెలు, వెండి ఆభరణాలతో పాటు హుండీ నగదును దుండగులు దోచుకెళ్లారు. అయినా ఆలయ నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం. ఈ ఆలయం వద్ద భద్రతాచర్యలు లేకపోవడంతో తరుచూ దొంగతనాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోయారు.

గ్యాస్ రీఫిల్ చేస్తూ పట్టుబడిన ఏజెన్సీ సిబ్బంది

●చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల డిమాండ్



ఖాళీ గ్యాస్ సిలిండర్‌ను కొలుస్తున్న గ్రామస్థులు

వెల్దుర్తి, సెప్టెంబరు 24 : వినియోగదారులకు డెలివరీ చేయాల్సిన గ్యాస్ సిలిండర్ నుంచి ఖాళీ సిలిండర్‌లోకి రీఫిల్ చేస్తున్న వ్యక్తులు పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళ్లితే వెల్దుర్తిలోని ఇండియన్ ఎస్‌వీఆర్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మంగళవారం మండల పరిధిలోని దామరంచ గ్రామానికి గ్యాస్ సిలిండర్లను ఇవ్వడానికి వెళ్లారు. ఈ క్రమంలో గ్రామం వెలుపల వ్యవసాయ పొలాల వద్ద వాహనాన్ని ఆపి నిండు సిలిండర్ నుంచి ఖాళీ సిలిండర్‌లోకి గ్యాస్ రీఫిల్ చేస్తున్నారు. అక్కడే పొలంలో ఉన్న ఓ మహిళ ఇచ్చిన సమాచరం మేరకు అక్కడికి చేరుకున్న గ్రామస్థులు వారిని గ్రామ పంచాయతీ వద్దకు తీసుకెళ్లారు. 15.9 కిలోలు ఉండాల్సిన ఖాళీ సిలిండర్ 18 కిలోలు రావడం, 29.8 కిలోలు ఉండాల్సిన నిండు గ్యాస్ సిలిండర్ 28 కిలోలు మాత్రమే ఉన్నది. విషయం తెలుసుకున్న ఆ ఏజెన్సీ నిర్వాహకుడు వెన్నవరం శ్రీనివాస్‌రెడ్డి దామరంచకు రాగా గ్రామస్థులు నిలదీశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

అక్రమ మైనింగ్‌పై విచారణ

●రాతికడీల నిల్వలు చూసి నివ్వెరపోయిన అధికారులు



రాంపూర్‌లో అక్రమ మైనింగ్ పై విచారణ జరుపుతున్న తహసీల్దార్ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అల్లాదుర్గం, సెప్టెంబరు 24 :ప్రభుత్వ భూమిలో అక్రమ మైనింగ్‌పై అల్లాదుర్గం తహసీల్దార్ అధికారులు మంగళవారం విచారణ జరిపారు. ఈ నెల 24న కొండలు పిండి..గుట్టలు గుల్ల.. శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై తహసీల్దార్ మల్లయ్య, ఆర్ఐ సందీప్, సర్వేయర్ రాజునాయక్ స్పందించి ఆయా స్థలాలను పరిశీలించారు. భారీగా నిల్వ ఉన్న రాతి కడీలను చూసి అధికారులే నివ్వెరపోయారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో మైనింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, రాంపూర్‌లో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో మెదక్ జిల్లాకు బంగారు పతకం

తూప్రాన్, సెప్టెంబరు 24: రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో మెదక్ జిల్లా బాలుర జట్టు బంగారు పతకం సాధించినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొడిప్యాక నారాయణగుప్తా తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఈ నెల 21 నుంచి 23 వరకు జరిగిన పోటీల్లో జిల్లా బాలుర జట్టు మొదటి నుంచీ ఆధిపత్యం కనబర్చినట్లు తెలిపారు. ఫైనల్‌లో నిజామాబాద్ జట్టుతో జరిగిన హోరాహోరీ పోరులో 5-3 స్కోర్‌తో విజయ సాధించిందన్నారు.



బంగారు పతకం సాధించిన జిల్లా జట్టు

జవహర్ నవోదయ విద్యాలయానికి పీఎం శ్రీ స్కూల్ హోదా



వర్గల్, సెప్టెంబరు 24 : వర్గల్ కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయానికి పీఎం శ్రీ స్కూల్ హోదా దక్కినట్లు ఆ విద్యాలయం ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొదటి దశలో 2022లో భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా సుమారు 14500 పీఎం శ్రీ విద్యాలయాలను గుర్తించిందన్నారు. వీటికి కేంద్ర ప్రభుత్వం నేరుగా నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధి, వనరుల సమీకరణ చేస్తుందన్నారు. అదేవిధంగా ప్రస్తుతం రెండవ దశలలో భాగంగా జవహర్ నవోదయ విద్యాలయాన్ని కేంద్రం గుర్తించడం సంతోషంగా ఉందన్నారు. కేంద్రం అందించే నిధులతో విద్యాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదం.. బొలెరోలో ఇరుక్కున్న డ్రైవర్

●రెండు గంటలు శ్రమించి రక్షించిన పోలీసులు, ఫైర్ సిబ్బంది

రామాయంపేట, సెప్టెంబరు 24 : రామాయంపేట బైపాస్‌లో మంగళవారం వేకువ జామున రోడ్డు ప్రమాదం జరుగుగా ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్లితే మహారాష్ట్ర నుంచి హైదరాబాద్ వైపు సంత్రాల లోడ్‌తో వెళ్తున్న బొలెరో వాహనం ముందు కారును బలంగా ఢీకొట్టింది. కారు రోడ్డు కిందకు దూసుకెళ్లగా.. నుజ్జునజ్జయిన బొలెరోలో డ్రైవర్ జమీర్ ఖాన్ ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, 108, ఫైర్, పోలీస్ సిబ్బంది ఘటన స్థలికి చేరుకుని రెండు గంటల పాటు శ్రమించి రక్షించారు. తీవ్ర గాయాలైన జమీర్, క్లీనర్ ఇబ్రాయిల్ ను రామాయంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాదుకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



బొలెరో వాహనంలో ఇరుక్కున్న డ్రైవర్

ప్రభుత్వం, పట్టభద్రులకు వారధిగా పనిచేస్తా

● పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్ రెడ్డి



మాట్లాడుతున్న వి.నరేందర్‌రెడ్డి

మెదక్, సెప్టెంబరు 24 : తనను గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి, పట్టభద్రుల మధ్య వారధిగా పని చేస్తానని ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ అన్నారు. మంగళవారం ఆయన మెదక్‌లోని తెలంగాణ గురుకుల పాఠశాల, ప్రభుత్వ హైస్కూల్, జూనియర్, డిగ్రీ కళాశాలల అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 34 సంవత్సరాలుగా విద్యారంగంలో ఉండి వేలాది మంది విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేశానన్నారు. ఎమ్మెల్సీగా గెలిపిస్తే వచ్చే వేతనాన్ని నిరుపేద విద్యార్థులు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి వెచ్చిస్తానన్నారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ పరిహారం ఇప్పించండి

● ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు భూ నిర్వాసితుల వినతి



ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు సమస్యను వివరిస్తున్న భూ నిర్వాసితులు

కుకునూరుపల్లి, సెప్టెంబరు 24 : భూమికి పరిహారం ఇప్పించాలని లకుడారం భూ నిర్వాసితులు మంగళవారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లన్నసాగర్ నుంచి తపస్పల్లి రిజర్వాయర్ లింకు కాలువ నిర్మాణానికి లకుడారం గ్రామ రైతుల నుంచి 30 ఎకరాలు సేకరించి పనులను ప్రారంభించారన్నారు. ఎకరాకు రూ.16.50లక్షల చొప్పున పరిహారం ఇస్తామని చెప్పి రెండేళ్ల గడిచినా ఇప్పటికీ అందించలేదన్నారు. పలు మార్లు మంత్రి, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేసిన ఫలితం లేదని ఎమ్మెల్సీతో తమ గోడును వెల్లబోసుకున్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్సీ సిద్దిపేట కలెక్టర్‌కి ఫోన్ చేసి సమస్యని పరిష్కరించాలని కోరగా ఆయన కలెక్టరేట్‌కి వచ్చి కలువాలని సూచించారు. అనంతరం ప్రజాభవన్‌లోనూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్ట రమేష్, సింగాటం అశోక్, ఎర్ర యాదగిరి, పైస పెంటయ్య, రాములు, కైలాసం తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఈడీ ట్యూబ్‌లైట్ల తయారీపై వర్క్‌షాప్



ఎల్ఈడీ ట్యూబ్‌లైట్ల తయారీ విధానాన్ని తెలుసుకుంటున్న విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 24 : సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ కేంద్రంలో జాతీయ హరిత దళం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎల్ఈడీ ట్యూబ్‌లైట్ల తయారీపై కార్యశాల నిర్వహించారు. జిల్లాలోని 50 పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు, 50 మంది ఉపాధ్యాయులకు తయారీ విధానాన్ని వివరించారు. పర్యావరణానికి మేలు చేసే ఈ ఎల్ఈడీ ట్యూబ్ లైట్లు తక్కువ విద్యుత్ ఖర్చుతో ఎక్కువ కాంతిని ఇస్తాయని రిసోర్స్ పర్సన్, రాష్ట్ర ఎన్‌జీసీ ప్రాజెక్టు అధికారి రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సాంప్రదాయేతర ఇంధన వనరులను వాడుకొని మనందరం పర్యావరణాన్ని కాపాడాలన్నారు. అనంతరం శిక్షకులు కార్తిక్, సాయి విద్యార్థులకు కంపోస్ట్ గుంతలు ఎలా నిర్వహించాలో వివరించారు. కార్యక్రమంలో సీఎంవో వెంకటేశం, ఏఎంవో అనురాధ, డీఎస్‌వో సిద్ధారెడ్డి, ఎన్‌జీసీ జిల్లా సమన్వయకర్త మాధవరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంస్య పతకం విజేతకు సత్కారం



అశ్వితను సత్కరించి సన్మానిస్తున్న గ్రామస్తులు, పెద్దలు

కొండాపూర్, సెప్టెంబరు 24 : అంతర్జాతీయ వేదికపై పాకశాస్త్రంలో కాంస్య పతకం సాధించిన తెలంగాణ అమ్మాయికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గిర్మాపూర్ చెందిన పోలీస్ అశ్విత అంతర్జాతీయ వేదికపై క్యాంస పతకం సాధించింది. ఫ్రాన్స్‌లోని లియాన్ నగరంలో పాకశాస్త్రంపై జరిగిన వరల్డ్ స్కిల్- 2024లో బెస్ట్ ఆఫ్ నేషనల్ కాంస్య అవార్డును గెలుచుకుంది. సెప్టెంబరు 11-15 మధ్య జరిగిన ఈ పోటీల్లో 70 దేశాల నుంచి 1400 మందికి పైగా పోటీ పడగా అశ్విత ప్రతిభను కనబర్చింది. కాగా, మంగళవారం అశ్వితను గిర్మాపూర్ గ్రామస్థులు ఘనంగా సత్కరించారు.. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, జయరాములు, మల్లేషం, నిర్మల, గ్రామస్తులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేశాకే పరిశ్రమల నిర్మాణ పనులు చేపట్టాలి

● రెండో రోజు భూనిర్వాసితుల ఆందోళన

వర్గల్, సెప్టెంబరు 24 : భూ సేకరణ సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేశాకే పరిశ్రమల నిర్మాణం చేపట్టాలని టీజీఐఐసీ భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు రెండోరోజు సోమవారమూ ఆందోళనలు చేపట్టి పరిశ్రమల నిర్మాణ పనులను అడ్డుకునారు. కార్యక్రమంలో రైతులు గోవర్ధన్‌రెడ్డి, నర్సారెడ్డి, పుసుల రమేశ్, యాదగిరి, నందు, అంజయ్య, శివయ్య, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హలో.. కొంచెం నెమ్మది



ఫోన్ మర్యాద పాటించాలంటున్న నిపుణులు

- పరిసరాల్లో ఉన్న వారికి ఇబ్బంది కలిగించకూడదని సూచన
- ఆ దిశగా చర్యలు లేకపోవడం లోపమేనంటున్న కంపెనీలు
- అసందర్భమైన రింగ్‌టోన్‌లతో అసహనం
- ఆఫీసుల్లోనూ పక్కవారిని పట్టించుకోని 'సెల్'స్పీకర్లు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): తాము ఎక్కడ ఉన్నామనే స్పృహ లేకుండా సెల్‌ఫోన్‌లో అరిచినట్లుగా మాట్లాడడం, చెవులు చిల్లులు పడేలా రింగ్‌టోన్లు, ప్రయాణ సమయంలో ముందూ వెనుకా ఉన్న వారికి అంతరాయం కలుగుతుందన్న స్పృహ లేకుండా పెద్ద సౌండ్‌తో వీడియోలు చూడడం.. చెప్పుకుంటూ పోతే ఎన్నెన్ని సిత్రాలో. చాలామందికి ఇప్పటికీ ఫోన్ మాట్లాడటం రాదంటున్నారు సెల్‌ఫోన్ ఆపరేటర్లు. పాశ్చాత్య దేశాలతో పోలిస్తే మన దగ్గర కనీస సెల్‌ఫోన్ మానర్స్ లేదని, అసలు దీని పట్ల అవగాహన కూడా లేదని చెబుతున్నారు ఎటిక్యాట్ శిక్షకులు. ఇదే విషయాన్ని సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఓఏఐ) ప్రతినిధులు ధృవీకరిస్తున్నారు. అన్‌లిమిటెడ్ కాలింగ్ సౌక్యం వచ్చిన తర్వాత అనవసర విషయాలనే ఫోన్‌లలో చర్చించడం పెరిగిపోయిందని, వదిలేయమన్నా, జిడ్డులా తమ సంభాషణ కొనసాగించి చంపేస్తున్నారని వాపోతున్న వారు ఎక్కువగానే ఉంటున్నారు. ఒక్కరే ఉన్నప్పుడు ఫోన్ ఎలా ఉపయోగించినా కాన్ఫరెన్స్‌లకు హాజరైనప్పుడు, ఆఫీస్‌లో ఉన్నప్పుడు, ఇతరులతో మాట్లాడుతున్నప్పుడు కొన్ని సూచనలు పాటించాలని సెల్‌ఫోన్ ఎటిక్యాట్ నిపుణులు నమ్రత సూచిస్తున్నారు.

ఇప్పుడూ మిస్డ్ కాలేనా..

అన్‌లిమిటెడ్ కాలింగ్ సౌకర్యం ఉన్నప్పటికీ మిస్డ్ కాల్ ఇచ్చే వారు ఇప్పటికీ అక్కడక్కడా ఉన్నారు. ఫోన్ లిఫ్ట్ చేయడమే వృథా అనుకునే వారికి ఇది అదనపు చిరాకు తెప్పిస్తుంది.

ఫోన్లు చూస్తూ కూర్చోవద్దు..

సమావేశాల్లో పాల్గొన్నప్పుడు విషయం మీద శ్రద్ధ వహించాలి తప్ప వాట్సాప్, మెసేజింగ్ చేయడం లేదంటే సోషల్ మీడియాలో పోస్టింగ్స్ చేయడం సరైంది కాదు.

ఫోన్‌ను సైలెంట్ లేదా వైబ్రేట్ మోడ్‌లో ఉంచండి..

'దయచేసి మీ మొబైల్‌ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేయండి. లేదంటే సైలెంట్‌లో ఉంచండి' అని చాలాచోట్ల ఈ సూచన వినిపిస్తుంది. చాలామంది దీన్ని పట్టించుకోరు. ఆఫీసుల్లో

మిగతా 6వ పేజీలో..

మూవీ రింగ్‌టోన్స్ అసలు పెట్టకూడదు..

మీకు ఎంత ఇష్టమైన సినిమా పాట అయినా సరే మొబైల్ రింగ్ టోన్‌గా పెట్టుకోకపోవడమే మంచిది. మీరున్న సందర్భానికి సూట్ కాని పాటలు ఒక్కోసారి ఇబ్బందిగా మారవచ్చు.

తర్వాత చేస్తామంటే చేయాల్సిందే..

మీరు మీటింగ్‌లో ఉన్నప్పుడు తర్వాత చేస్తామని చెప్పడం లేదా మెసేజ్ చేసి వదిలేశారంటే అది మీపై అవతలి వారికి చెడు అభిప్రాయం కలిగించవచ్చు. కాల్ బ్యాక్ ఆఫ్టర్ 15 మినిట్స్ అని మెసేజ్ పెడితే 15 నిమిషాల తర్వాత అవతలి వ్యక్తికి ఫోన్ చేయాలి. కుదరని పక్షంలో అరగంట తరువాత అయినా ఫోన్ చేసి ముందుగా అవతలి వ్యక్తికి క్షమాపణ చెప్పి మీ సంభాషణ కొనసాగించాలి.

మాట్లాడే ముందు.. అడగాలి..!

మీకు బాగా క్లోజ్‌గా ఉన్నవాళ్లు లేదంటే బంధువులు అయితే పర్వాలేదు కానీ తెలియని అంతగా పరిచయం లేని వ్యక్తులతో మాట్లాడేముందు.. అవతలి వ్యక్తితో మీరు మాట్లాడటానికి సరి అయిన సమయమేనా అని అడగాలి. అవతలి వ్యక్తి కొనసాగించాలి అన్నప్పుడు మాత్రమే సంభాషణ కొనసాగించాలి. ఒకవేళ అతను తరువాత ఫోన్ చేయమంటే.. ఎంతసేపటి తరువాత చేయమంటారని గౌరవంగా అడగడంలో తప్పులేదు.

అంతర్జాతీయ సదస్సుకు డా.కృష్ణమూర్తికి ఆహ్వానం



డా.కృష్ణమూర్తి

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 24: అమెరికాలోని హూస్టన్ నగరంలో కాంగ్రెస్ ఆఫ్ న్యూరోలాజికల్ సర్జన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ సదస్సుకు సంగారెడ్డి జిల్లాకు చెందిన ప్రముఖ న్యూరో సర్జన్, హోప్ న్యూరో అండ్ కార్డియాక్ హాస్పిటల్ అధినేత డా.కృష్ణమూర్తికి ఆహ్వానం లభించింది. ఐదురోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో ఆయన పాల్గొననున్నారు. ఈ సందర్భంగా డా.కృష్ణమూర్తి మాట్లాడుతూ అత్యాధునిక వైద్య విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం, దాని ఉపయోగంపై అవగాహన పెంచుకుని సంగారెడ్డి జిల్లా, పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలకు అంతే అత్యాధునిక వైద్యమందించే ప్రయత్నం చేస్తానని తెలిపారు. డా.కృష్ణమూర్తికి పలువురు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

హరితహారం చెట్లపై గొడ్డలి వేటు

కొండపాక, సెప్టెంబరు 24: హరితహారం లక్ష్యాన్ని కొందరు నీరు కారుస్తున్నారు. సుమారు 8 సంవత్సరాల క్రితం కొండపాక మండలం, ఖమ్మంపల్లి నుంచి పెద్దమాసాన్‌పల్లికి వెళ్లే బీటీ రోడ్డు పక్కన నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. కానీ రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ భూములకు చెందిన ఓ రైతు చెట్లను ఇష్టానుసారంగా నరికి వేశాడు. చెట్లను కాపాడాల్సిన ఫారెస్ట్ అధికారులు పట్టించు కోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.


నరికివేసిన చెట్ల మొదళ్లు

అధ్వానంగా రోడ్లు..!

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు

తొగుట, సెప్టెంబరు 24: ప్రభుత్వాలు మారినప్పటికీ ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాల అభివృద్ధి ముందుకు సాగడం లేదు. దీంతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. తొగుట అంటే గతంలో అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచేది. కానీ నేడు అందుకు భిన్నంగా మారింది. మండల కేంద్రంలో ఎక్కడ చూసినా సమస్యలు తాండవం చేస్తున్నాయి. గ్రామంలోకి వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని, అయినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామ అభివృద్ధి కోసం పాటుపడాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదు. తొగుట గ్రామంలోని రోడ్లపై ప్రయాణించాలంటేనే వాహనదారులు, ప్రజలు జంకుతున్నారు. తొగుట పోలీసుస్టేషన్ నుంచి గ్రామం మీదుగా పోచమ్మగుడి వరకు రెండు కిలోమీటర్లమేర ఉన్న రింగు రోడ్డుపై నుంచి భారీ వాహనాలు వెళ్తుండడంతో తారు రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గుంతల్లో నీరు చేరి కుంటలను తలపిస్తున్నాయి. గ్రామంలోకి రావడానికి అదే దారి ఉండటంతో రోజు ఆ రహదారిపై ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడే పరిస్థితి నెలకొన్నది. కనీసం గుంతల్లో మట్టి పోసి పూడ్చడానికి కూడా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రయత్నించడం లేదని స్థానికులు, వాహనదారులు మండి పడుతున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


తొగుటలో గుంతలమయంగా రోడ్డు

తారు రోడ్లు వేయాలి



రహదారిపై వెళ్లాలంటేనే ఇబ్బందిగా ఉన్నది. వర్షం పడితే రోడ్డుపై నీళ్లు చేరి ఎక్కడ గుంత ఉందో తెలియక ఇబ్బంది పడుతున్నాం. గుంతల కారణంగా కొందరు ప్రమాదాల బారినపడి గాయాలపాలయ్యారు. త్వరితగతిన తారు రోడ్డు నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కరించాలి.

- రామెళ్ల అనిల్‌కుమార్, తొగుట

ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలని వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు సూచించారు. ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎన్ఎస్ఎస్ పితామహుడు డాక్టర్ వీకేఆర్‌వీరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


మద్దూరు: వీకేఆర్‌వీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు


సిద్దిపేట కల్చరల్: ఉత్తమ వలంటీర్ సర్టిఫికెట్లను చూపుతున్న విద్యార్థులు


కొండపాక: కళాశాల ఆవరణలో శ్రమదానం చేస్తున్న విద్యార్థులు


హుస్నాబాద్ టౌన్: బాలికల జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆకారంలో విద్యార్థినులు

కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్

హుస్నాబాద్, సెప్టెంబరు 24: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 24: కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహేష్ పేర్కొన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలు అమలు చేసిందన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

నంగునూరు,సెప్టెంబరు 24: ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నంగునూరు తహసీల్దార్ సరిత సూచించారు. మండలంలోని పాలమాకులలో మహాలక్ష్మి పథకం కింద మంజూరైన సబ్సిడీ ప్రొసీడింగ్ పత్రాలను మంగళవారం ఆమె లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రంగు అశోక్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి అనిత, ఫీల్డ్ అసిస్టెంట్ అంబటి శ్రీనివాసు, పార్టీ గ్రామ అధ్యక్షుడు బసవరాజు రాములు, ఐలయ్య, చంద్రం ,మహేశ్, బసవరాజ్ శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

భాషల శ్రేయస్సే లక్ష్యం

చేర్యాల, సెప్టెంబరు 24: భాషలను పరిరక్షించడంతో పాటు బోధించే ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకై రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ కృషి చేస్తున్నదని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుళ్లపల్లి తిరుమల కాంతికృష్ణ తెలిపారు. కడవేర్గు ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడారు. పండిత పరిషత్ పోరాట ఫలితంగా భాషా పండిత్‌లకు పదోన్నతులు లభించాయన్నారు. కార్యక్రమంలో నవీన్, కనకలింగం, ధర్మారెడ్డి, కరుణాకర్, రఘుపతి, శ్రీనివాస్, మూర్తి, శారద, కవిత పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి

నంగునూరు ,సెప్టెంబరు 24: పిడుగుపడి రూ.70వేల విలువ చేసే ఎద్దు మృతి చెందిన సంఘటన నంగునూరు మండలం బద్దిపడగలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన వేముల సులోచన అనే మహిళా రైతు తన వ్యవసాయ బావి దగ్గర ఎద్దును కట్టేసి ఇంటికి వెళ్లింది. సోమవారం రాత్రి కురిసిన వర్షంతో పాటు పిడుగుపాటుకు ఎద్దు మృతి చెందింది.

ములుగు: వర్షపు నీరు ఇంట్లోకి రావడంతో వస్తువులు తడిసి ముద్దయ్యాయి. మండల కేంద్రంలోని ములుగులో మంగళవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి గ్రామంలోని కమ్మరి శ్రీనివాస్ ఇంట్లోకి మురుగు నీరు చేరింది.

'సన్మార్గంలో నడవాలి'

రాయపోల్, సెప్టెంబరు 24: చెడు అలవాట్లను మాని సన్మార్గంలో నడవాలని తొగుట సీఐ లతీఫ్ పిలుపునిచ్చారు. మండలంలోని ఎల్కల్‌లో సోమవారం రాత్రి ఆజాద్ డిఫెన్స్ అకాడమీ గజ్వేల్ ఆధ్వర్యంలో 'పదో తరగతి ఉత్తీర్ణులైతే ప్రభుత్వ ఉద్యోగం' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తొగుట సీఐ లతీఫ్ మాట్లాడుతూ.. కేంద్రం అగ్నిపథ్ పథకాన్ని ప్రవేశపెట్టిందని, యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆర్మీలో చేరితే శారీరక దృఢత్వం లభించడంతో పాటు మానసికంగా సంతృప్తి పొందుతారని తెలిపారు. అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసిన ఆజాద్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ రిటైర్డ్ ఆర్మీ నీల చంద్రంను అభినందించారు. కార్యక్రమంలో బేగంపేట ఏఎస్ఐ అమృత్, సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- డీఈవో ఎల్లంకి శ్రీనివాసరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాసరెడ్డి

నంగునూరు, సెప్టెంబరు 24: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని నర్మెట ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలను ఎంఈవో తగిరెడ్డి దేశిరెడ్డి తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని తెలిపారు.

- **మిరుదొడ్డి:** మండల కేంద్రమైన మిరుదొడ్డిలో జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. మండలస్థాయి క్రిడల్లో గెలుపొందిన క్రీడాకారులకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోటకమలాకర్‌రెడ్డి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రభుదాస్, ఎంపీడీవో గణేష్ రెడ్డి, నాయకులు అంజిరెడ్డి, రాజులు, లింగం ఉన్నారు.

'ఉత్తీర్ణతను పెంచేందుకు కృషిచేయాలి'


విద్యార్థులతో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

గజ్వేల్, సెప్టెంబరు 24: కళాశాలలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు అధ్యాపకులు కృషిచేయాలని సిద్దిపేట జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి సూచించారు. గజ్వేల్ పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కళాశాలలకు తలమానికంగా ఉన్న ఎడ్యుకేషన్ హబ్‌లో అడ్మిషన్లు, ఉత్తీర్ణత శాతం పెరిగేలా కృషిచేయాలని, పేద బడుగు, బలహీనవర్గాల పిల్లలు ప్రభుత్వ కళాశాలల్లో చేరేందుకు చొరవ చూపాలని అధ్యాపకులకు సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్, అధ్యాపకులు వెంకటరమణ, ప్రకాశ్, రాజిరెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు


సంఘం ఏర్పాటుతో ఉపయోగం

- మండల వ్యవసాయాధికారి నాగేందర్‌రెడ్డి

మర్కుక్, సెప్టెంబరు 24: రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేయడం వల్ల మర్కుక్ మండల ప్రాంత రైతులకు చాలా ఉపయోగాలు ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి నాగేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్యాలయంలో మంగళవారం ఎఫ్‌పీసీ కమిటీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు కొరత లేకుండా ఎరువులు చౌక ధరలకే అందుబాటులో ఉంటున్నాయంటే దానికి ప్రధాన కారణం రైతు ఉత్పత్తిదారుల సంఘమేనన్నారు. కార్యక్రమంలో రైతులు మంద నాగిరెడ్డి, హన్మంతరె డ్డి, రామ్మోహన్‌రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- సీడీపీవో సరిత


మాట్లాడుతున్న సీడీపీవో సుజాత

మర్కుక్, సెప్టెంబరు 24: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని సీడీపీవో సరిత పేర్కొన్నారు. పోషణమాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాములపర్తి ప్రాథమిక పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వివరించారు. చిరుధాన్యాలను తీసుకోవడం వల్ల షుగర్, బీపీలాంటి వ్యాధులు దరిచేరవని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎండీ. అబ్దులుద్దీన్, వైద్యాధికారి దీప, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఖాదీర్, పోషణ అభియాన్ బ్లాక్ కో ఆర్డినేటర్ కిరణ్, వైద్య సిబ్బంది, గ్రామ కార్యదర్శి, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు రాణి, స్వప్న, సంతోష సుజాత, జైబూనిస పాల్గొన్నారు.

రక్షణ కల్పించేందుకే కాటమయ్య సేఫ్టీ మోకులు: అనిల్‌గౌడ్

హుస్నాబాద్‌రూరల్, సెప్టెంబరు 22: కల్లుగీత కార్మికులు కల్లుతీసే సమయంలో తాటి, ఈత చెట్లపై నుంచి పడి ప్రమాదాల బారినపడకుండా రాష్ట్ర ప్రభుత్వం కాటమయ్య సేఫ్టీ మోకులను అందిస్తున్నదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్క అనిల్‌గౌడ్ పేర్కొన్నారు. హుస్నాబాద్ మండలం పందిల్లలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం హుస్నాబాద్ నియోజక వర్గంలోని కల్లుగీత కార్మిక సొసైటీ సభ్యులకు సేఫ్టీ మోకులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- డీపీవో దేవకీదేవి

కొండపాక, సెప్టెంబరు 24: పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి సూచించారు. కొండపాకలో మంగళవారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తడిపొడి చెత్తపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

- **సిద్దిపేట టౌన్:** నడక ఆరోగ్యానికి మంచిదని, పట్టణ పరిశుభ్రత మనందరి బాధ్యతని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని కోమటిచెరువు కట్టపైన స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా మార్నింగ్ వాకర్స్, మున్సిపల్ సిబ్బంది చెత్తను తొలగించారు. అనంతరం స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఐటీసీ, వావ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.
- **చేర్యాల:** పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి తెలిపారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బాలికల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో స్వచ్ఛదనంపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ నాగేందర్, మేనేజర్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సిద్దిపేట టౌన్: స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

- **మద్దూరు:** మండలంలోని రేబర్తిలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి గ్రామస్థులు ఆలయ ఆవరణలో శ్రమదానం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జాదవ్ మాదవ్, ఆశాలు యశోద, కవిత, కనకలక్ష్మి, మహిళా సంఘాల సభ్యులు జయమ్మ, సబిత, పరమేశ్వరీ, బాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గవ్వల గణేష్, యాదవరెడ్డి, శంకరయ్య, బెల్లపు అయిలయ్య గ్రామస్థులు పాల్గొన్నారు.

హాస్టల్ మంజూరు చేయాలని మంత్రి 'పొన్నం'కు ఏఐఎస్ఎఫ్ వినతి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న జనార్దన్

హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 24: హుస్నాబాద్ పట్టణంలోని ఎస్సీ బాలుర కళాశాలకు వసతి గృహాన్ని మంజూరు చేయాలని మంగళవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్దన్ వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ కళాశాలకు వసతి గృహం లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై అనేక మార్లు అధికారులకు వినతిపత్రం సమర్పించినా స్పందించలేదని ఆరోపించారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి తదితరులున్నారు.

- **అక్కన్నపేట:** మండలంలోని చౌటపల్లి, అంతకపేట, గొల్లకుంట, అక్కన్నపేటలో ఇటీవల మృతి చెందిన పలువురి మృతుల కుటుంబసభ్యులను మంగళవారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగాపల్లి ఐలయ్య, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, కట్కూర్ సింగిల్ విండో వైస్ చైర్మన్ భూపతి ముకుందరెడ్డి, తదితరులున్నారు.

నిర్దేశిత సమయంలో సిలబస్ పూర్తి చేయాలి: చేబర్తి కాంప్లెక్స్ హెచ్ఎం

మర్కుక్, సెప్టెంబరు 24: నిర్దేశిత సమయంలో సిలబస్ పూర్తి చేయాలని, దసరా సెలవుల తరువాత ఎస్ఏ-1(సమ్మేటివ్ అసెస్మెంట్) పరీక్షలు ఉన్న నేపథ్యంలో విద్యార్థులకు సెలవులలో చదువుకునే వీలు కల్పించాలని చేబర్తి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శంకర్‌రెడ్డి సూచించారు. మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల శివారు వెంకటాపూర్, వరదరాజపూర్, ఎర్రవల్లి, అంగడికిష్టాపూర్‌తో పాటు నరసన్నపేట ప్రాథమిక పాఠశాలలు మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్క్‌షీట్ ప్రకారం ఎప్పటికప్పుడు సిలబస్ పూర్తి చేయాలని అన్నారు. ఆయనవెంట వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కూచిరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటేష్, బాలకిషన్, ఉపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, మల్లేశం, కుమార్, కనకారావు, హారిక, సంతోషిమాత, చిన్నికృష్ణ తదితరులున్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా


ధర్నా చేస్తున్న హరికృష్ణారెడ్డి, గ్రామస్థులు

మిరుదొడ్డి, సెప్టెంబరు 24: పోలీస్‌స్టేషన్‌లో మూడు రోజుల క్రితం ఫిర్యాదు చేసినా ఎస్ఐ పట్టించుకోవడంలేదని తొగుట పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి ఆరోపించారు. మిరుదొడ్డి గుడికందుల గ్రామస్థులతో కలిసి మంగళవారం మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గోవర్ధనగిరికి చెందిన కొంతమంది యువకులు తనను చంపుతామని బెదిరించడంతో మూడు రోజులక్రితం ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. అయినా పోలీసులు పట్టించుకోకపోవడంతో గ్రామస్థులతో కలిసి ధర్నా చేసినట్టు తెలిపారు.

'హిందూ సనాతన ధర్మం గొప్పది'

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 24: హిందూ సనాతన ధర్మం ఎంతో గొప్పదని రామకోటి రామరాజు పేర్కొన్నారు. గజ్వేల్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కోట్లాది భక్తులు ఎంతో పవిత్రంగా భావించే తిరుపతి లడ్డూను అపవిత్రం చేసి భక్తుల నమ్మకాన్ని కొల్లగొట్టారన్నారు ఆరోపించారు.

గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి: టీజీ యూటీఎఫ్

కొండపాక, సెప్టెంబరు 24: గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం టీజీ యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో దుద్దెడ సాంఘిక సంక్షేమ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా టీజీ యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి మాట్లాడుతూ.. గురుకుల పాఠశాల విద్యార్థుల మెస్ చార్జీల పెంపు ఉత్తర్వులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 28వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించే మహా ధర్నాకు గురుకుల పాఠశాలను ఉపాధ్యాయులందరూ భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీజీయూటీఎఫ్ మండలాధ్యక్షుడు వై.శ్రీనివాస్, గురుకులాల జిల్లా కన్వీనర్ వి.కృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.సతీష్‌కుమార్, ఉపాధ్యాయులు పి.వాసు, చంద్రశేఖర్, నరేష్, స్వప్న జ్యోతి, రమేష్, బాలమణి, యాదగిరి, శివకుమార్, స్వామి, మనివర్మ, రమేష్ పాల్గొన్నారు.

'గజ్వేల్ బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో నీటి సమస్యను పరిష్కరించాలి'


వినతిపత్రం అందజేస్తున్న యూఎస్ఎఫ్ఐ నాయకులు

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 24: గజ్వేల్ బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో నీటి సమస్యను పరిష్కరించాలని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి మాట్లాడుతూ.. సుమారు వెయ్యి మంది విద్యార్థులు హాస్టల్లో చదువుకుంటూ ఉంటే వారికి కనీస అవసరాలు కూడా తీర్చడంలో సిబ్బంది విఫలమయ్యారని ఆరోపించారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ నాయకులు మధు, శ్రావణ్, వినయ్, వేణు, ప్రవీణ్ పాల్గొన్నారు

పొగాకు నియంత్రణ కేంద్రం ప్రారంభం


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కళాశాల అధికారులు

సిద్దిపేట అర్బన్ సెప్టెంబరు 24: కేంద్ర మంత్రిత్వ శాఖ, నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అన్ని మెడికల్ కళాశాలలో పొగాకు నియంత్రణ కేంద్రాలను వర్చువల్‌గా ప్రారంభించిన సందర్భంగా, సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలోని సురభి మెడికల్ కళాశాలలో కూడా పొగాకు నియంత్రణ కేంద్రాన్ని ప్రారంభించినట్లు మెడికల్ కాలేజ్ డీన్ రఫీ, డైరెక్టర్ రాంప్రసాద్, సూపరింటెండెంట్ శివరామచారి తెలిపారు. మత్తు పదార్థాల వ్యసనం ఉన్నవారికి చికిత్స అందించి అలవాటును మాన్పించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కర్ణాకర్, రాజేష్, హరీష్, దేవిక, లీలా, పీఆర్‌వో పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

టాయిలెట్ల నిర్మాణానికి స్థల పరిశీలన

కొండపాక, సెప్టెంబరు 24: కొండపాక మండలం వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద బస్సు షెల్టర్ టాయిలెట్ల నిర్మాణం చేయడం కోసం అధికారులు మంగళవారం స్థల పరిశీలన చేశారు. గజ్వేల్ డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి పలువురు అధికారులతో కలిసి వెలికట్ట క్రాస్‌రోడ్ వద్ద స్థలాలను పరిశీలించారు. త్వరలోనే ఇక్కడ బస్సు షెల్టర్ మూత్రశాలల నిర్మాణం చేపట్టనున్నట్టు అయిన వివరించారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

జీడిమెట్ల సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జీడిమెట్ల పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చిట్యాలకి చెందిన పి. సాయికృష్ణ (23) నగరంలోని కుత్బుల్లాపూర్‌లోని శ్రీనివాస్ నగర్‌లో నివాసముంటున్నాడు. సూరారంలోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం తను ఉంటున్న గదిలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబసభ్యులు జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు

విద్యుదాఘాతంతో రైతు మృతి

దుబ్బాక, సెప్టెంబరు 24: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన దుబ్బాక మండలం రఘోత్తంపల్లిలో సోమవారం రాత్రి చోటుచేసుకున్నది. దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గౌరి అంజయ్య(71)అనే రైతు తన కుమారుడు నరేష్‌తో కలిసి వ్యవసాయ పొలంవద్దకు వెళ్లాడు. బోరుమోటార్ వద్ద గడ్డి కోస్తుండగా ప్రమాదవశాత్తు వైరుతగిలి అక్కడికక్కడే మృతిచెందినట్టు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన డీసీఎం

కొండపాక, సెప్టెంబరు 24: రోడ్డు దాటుతున్న ద్విచక్రవాహనాన్ని డీసీఎం వ్యాను ఢీ కొట్టిన సంఘటన కొండపాక మండలం దుద్దెడలో మంగళవారం చోటుచేసుకున్నది. దుద్దెడకు చెందిన మహేందర్ గ్రామం నుంచి ద్విచక్రవాహనంపై రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న డీసీఎం ఢీ కొట్టింది. దాంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. టోల్ ప్లాజా అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వృద్ధురాలి పుస్తెలతాడు చోరీ

సిద్దిపేట క్రైం సెప్టెంబర్ 24: వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడు చోరీ చేసిన సంఘటన సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్‌లో మంగళవారం చోటుచేసుకున్నది. బాధితురాలు తెలిపిన వివరాలు ప్రకారం.. నర్సాపూర్‌కు చెందిన వృద్ధురాలు కోర్రె సత్తవ్వ ఇంట్లో ఉన్నప్పుడు గుర్తుతెలియని ఓ వ్యక్తి వచ్చి మంచినీళ్లు ఇవ్వండని అడిగాడు. ఆ వృద్ధురాలు ఇంట్లో నుంచి మంచి నీళ్లు తీసుకువచ్చి ఇస్తుండగా ఆ వ్యక్తి వృద్ధురాలి మెడలో నుంచి నాలుగు తులాల పుస్తలతాడును తెంపుకొని పారిపోయాడు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'ఎమ్మెల్యే ఇంటిపై దాడి హేయమైన చర్య'


సిద్దిపేట టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న శ్యామ్‌యాదవ్

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు24: నర్సాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి ఇంటి మీద దాడి హేయమైన చర్య అని బీఆర్ఎస్ సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షుడు పయ్యావుల శ్యామ్ యాదవ్ మండిపడ్డారు. సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవిందారం రవి, ఆకుల సతీష్, మెరుగు మాధవ్, పడిగే ప్రశాంత్, పిట్ల వంశీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

- **మిరుదొడ్డి:** నర్సాపూర్ ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి ఇంటిపై కాంగ్రెస్ నాయకులు దాడిచేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ మిరుదొడ్డి మండల అధ్యక్షుడు అంజిరెడ్డి పేర్కొన్నారు. మిరుదొడ్డిలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. ఆయనవెంట మిరుదొడ్డి మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు రాజులు, నాయకులు కమలాకర్‌రెడ్డి, బాల్‌రాజు,లింగం, సత్యనారాయణ ఉన్నారు.

అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న 'హైడ్రా'

- గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్

గజ్వేల్, సెప్టెంబరు 24: అక్రమార్కుల గుండెల్లో హైడ్రా రైళ్లు పరుగెత్తిస్తున్నదని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరార్‌ఖాన్ అన్నారు. గజ్వేల్ పట్టణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. హైడ్రా ప్రయోగంతో జంట నగరాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తుండగా, మంచిని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నేతలు రాజకీయ లబ్ధి కోసం రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. చిన్నపాటి వర్షానికి జంటనగరాలు జలమయం అవుతుండగా, ఆ పాపం రాష్ట్రాన్ని పదేళ్ల పాలించిన కేసీఆర్‌కే తగులుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

'సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి'

చిన్నకోడూరు, సెప్టెంబరు 24: పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రం శాస్త్ర వేత్త శ్రీజయ అన్నారు. మండలంలోని మాచాపూర్, చంద్లాపూర్, చిన్నకోడూరు, మెట్టుపల్లి, ఇబ్రహీంనగర్, గోనేపల్లి గ్రామాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, కంది పంటలను మంగళవారం పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శాస్త్ర వేత్తలు పల్లవి, శ్వేత, ఉమారాణి, రమాదేవి, సరిత, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించాలి: డీఏవో రాధిక

కుకునూరుపల్లి, సెప్టెంబరు 24: శిక్షణలో నేర్చుకున్న విషయాలపై రైతులకు అవగాహన కల్పించి పాటించే విధంగా చూడాలని అధికారులు జిల్లా వ్యవసాయ అధికారి రాధిక సూచించారు. జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారులకు వాలాంతరి సంస్థ నిర్వహించిన శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రాధిక మాట్లాడారు. అనంతరం విస్తరణ అధికారులకు సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో వాలంతరీ అధికారులు సునిత, అన్నపూర్ణ, డివిజన్ వ్యవసాయ అధికారి బాబునాయక్, మండల వ్యవసాయ అధికారి గోవిందరాజు పాల్గొన్నారు.

'విద్యార్థి దశ కీలకం'

గజ్వేల్, సెప్టెంబరు 24: ప్రతీ వ్యక్తి జీవితంలో విద్యార్థి దశ కీలకమని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా అన్నారు. గజ్వేల్ పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కమల, అధ్యాపకులు, భరోసా సెంటర్ సిబ్బంది షీటీమ్ సిబ్బంది పాల్గొన్నారు.